మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రతిమ

లోక్ అదాలత్‌ల ద్వారా సత్వర న్యాయం

జిల్లా జడ్జి ప్రతిమ • జిల్లా వ్యాప్తంగా 56,167 కేసులు పరిష్కారం

కోర్టుచౌరస్తా, డిసెంబర్ 14: లోక్ అదాలత్‌ల ద్వారా రాజీ చేయదగిన క్రిమినల్, సివిల్ కేసులను పరిష్కరించుకొని సత్వర న్యాయం పొందవచ్చని కరీంనగర్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్, జిల్లా జడ్జి బీ ప్రతిమ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్‌లో శనివారం ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్ ప్రారంభ కార్యక్రమానికి జడ్జి హాజరై మాట్లాడారు. అనవసరపు తగాదాలతో వేసుకున్న చిన్న చిన్న కేసులు, కుటుంబ తగాదాల కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకుంటే డబ్బు, సమయం వృథా కాకుండా ఉంటుందని, ఇరు పార్టీల మధ్య సంతోషకర వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. ప్రతి మండల, జిల్లా కేంద్రాల్లో న్యాయ సేవాధికార సంస్థలు ఉంటాయని, వాటిని ఆశ్రయించి ఉచితంగా న్యాయ సహాయం, సలహాలు పొందవచ్చని చెప్పారు. అలాగే, లోక్ అదాలత్‌లో కరీంనగర్ పట్టణ ఏసీపీ నరేందర్ మాట్లాడుతూ, రాజీ చేయదగిన క్రిమినల్ కేసులను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి వెంకటేశ్ లోక్ అదాలత్‌ల గురించి వివరించారు. కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రాజ్ కుమార్, కార్యదర్శి బీమసాహెబ్ మాట్లాడుతూ, లోక్ అదాలత్‌లకు బార్ అసోసియేషన్ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. అనంతరం న్యాయమూర్తులు లోక్ అదాలత్‌లు నిర్వహించి కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, అడిషనల్ పీపీ గౌరు రాజిరెడ్డి, ఏసీపీ వెంకటరమణ, సీఐలు జాన్ రెడ్డి, స్వామి, విజయ్‌కుమార్, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 56,167 కేసులు పరిష్కారం

జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లలో 56,167 కేసులు పరిష్కరించామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి వెంకటేశ్ తెలిపారు. వీటిలో 36 సివిల్ కేసులు, 2,464 క్రిమినల్ కేసులు, 53,667 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కేసుల పరిష్కారంలో రాష్ట్రంలో జిల్లాకు 23వ స్థానం లభించినట్లు తెలిపారు.

ఉజ్వల భవిష్యత్ వైపు అడుగులు వేయాలి

చల్లూరు ఆల్ఫ్రెడ్ నోబెల్ స్కూల్‌లో క్రీడలను ప్రారంభిస్తున్న హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ

వీణవంక, డిసెంబర్ 14: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ ఉజ్వల భవిష్యత్ వైపు అడుగులు వేయాలని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ సూచించారు. మండలంలోని చల్లూరు ఆల్ఫ్రెడ్ నోబెల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీటింగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసీపీ శ్రీనివాస్ జీ, ఎంఈవో శోభారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ కాగడను వెలిగించి క్రీడలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వంతో పాటు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమిని స్ఫోర్టివ్‌గా తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా విద్యార్థులతో కలిసి పోలీసులు, ఉపాధ్యాయులు డ్రగ్స్, గంజాయిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జమ్మికుంట రూరల్ సీఐ కిశోర్, వీణవంక ఎస్ఐ తిరుపతి, విద్యాసంస్థల డైరెక్టర్ జాన్ థామస్, ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేకుర్తిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం

19వ డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

- తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం
- ఇంటింటికీ ప్రతి రోజు తాగునీరందిస్తాం
- నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు

కార్పొరేషన్, డిసెంబర్ 14: రేకుర్తి రాబోయే నాలుగు మాసాల్లో పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందిన ప్రాంతంగా మారబోతున్నదని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. శనివారం రేకుర్తిలో రూ.1.20 కోట్లతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగర పాలక సంస్థ పరిధిలో కోట్లాది రూపాయల నిధులు కేటాయించి అభివృద్ధిని నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తున్నామన్నారు. రేకుర్తి ప్రాంతంలోని 18, 19వ డివిజన్లలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. గతంలో రేకుర్తి ప్రాంతం గ్రామపంచాయతీ పరిధిలో ఉండి నిధులు లేక ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రేకుర్తితో పాటు నగరం చుట్టు పక్కల ఉన్న 8 గ్రామాలు నగరపాలక సంస్థలో విలీనమైన తర్వాతే అభివృద్ధి బాట పట్టాయన్నారు. రేకుర్తి అంబేద్కర్ చౌరస్తా నుంచి శాతవాహన యూనివర్సిటీ వరకు చక్కటి రోడ్డుతో పాటు రెండు డివిజన్లలో డ్రైనేజీ వ్యవస్థను నిర్మాణం చేశామని గుర్తు చేశారు. రూ.6 కోట్లతో పైపులైన్ వేసి కొన్ని ప్రాంతాలకు తాగునీరు అందించామన్నారు. కంటి హాస్పిటల్‌తో పాటు రెండు డివిజన్లలో అంతర్గత రోడ్లను నిర్మాణం చేశామన్నారు. ప్రస్తుతం కాలనీలు పెరుగడంతో ఆయా ప్రాంతాల్లో కూడా రూ.వందల కోట్లు కేటాయించి అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. రేకుర్తి ప్రజల తాగునీటి సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. రూ.147 కోట్లతో అమృత్ 2లో ప్రతి వీధికి పైపులైన్ వేసి 30 లక్షల సామర్థ్యం గల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ట్యాంకులు నిర్మాణం చేసి ఇంటింటికీ ప్రతి రోజు తాగునీరు అందిస్తామని తెలిపారు. విలీన గ్రామాల డివిజన్ ప్రజలకు అన్ని మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎదుర్ల రాజశేఖర్, డీఈ అయూబ్ ఖాన్, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

గురుకులాల్లో న్యూ కామన్ డైట్ ప్రారంభం

మానకొండూర్ రూరల్: దేవంపల్లి బాలుర గురుకుల పాఠశాలలో కామన్ డైట్ మెనూను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్, తదితరులు

మానకొండూర్ రూరల్/ గన్నేరువరం/ గంగాధర/ రామడుగు/ తిమ్మాపూర్/ చొప్పదండి/కరీంనగర్ రూరల్/ జమ్మికుంట (హుజూరాబాద్ టౌన్), డిసెంబర్14: జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు న్యూ కామన్ డైట్ మెనూను శనివారం ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. మానకొండూర్ మండలం దేవంపల్లి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో కొత్త మెనూను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ప్రపుల్ దేశాయ్‌తో కలిసి ప్రారంభించారు. గన్నేరువరం మండలం గుండ్లపల్లి మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో కామన్ డైట్ మెనూను ఎమ్మెల్యే సత్యనారాయణ ప్రారంభించారు. ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచిన సందర్భంగా గంగాధర మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల, మధురానగర్‌లోని బాలికల గురుకుల పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై మాట్లాడారు. గురుకుల పాఠశాలల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. రామడుగు మండలం వెదిరలోని ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాలను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెల్ల శారద సందర్శించారు. వసతిగృహ నిర్వాహకులు విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రభుత్వ సూచనల మేరకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. కరీంనగర్ మండలం నగునూర్‌లోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో సుడా చైర్మన్ కొమటిరెడ్డి నరేందర్ రెడ్డి, తిమ్మాపూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలికల పాఠశాలలో ఖమ్మం జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రాంత్ సింగ్, చొప్పదండి పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల కళాశాలలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేశ్ విద్యార్థులకు న్యూ కామన్ డైట్ మెనూను ప్రారంభించారు. జమ్మికుంట పట్టణంలోని పలు సంక్షేమ హాస్టళ్లను జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్ కుమార్ సందర్శించారు. ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే, మండలంలోని గంధ్రపల్లి గ్రామ శివారులోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలను ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ్ ప్రకాశ్ సందర్శించారు. విద్యార్థులకు కల్పించిన వసతులు, సౌకర్యాలను పరిశీలించారు.

వీణవంక: లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

హుజూరాబాద్ టౌన్/ వీణవంక, డిసెంబర్ 14: హుజూరాబాద్ నియోజకవర్గంలో వివిధ కారణాలతో అనారోగ్యం పాలై చికిత్స పొందిన వారికి సుమారు 50 లక్షల రూపాయల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆయా మండలాల్లో పంపిణీ చేశారు. హుజూరాబాద్ పట్టణంలోని తన నివాసంలో హుజూరాబాద్ మండలానికి చెందిన లబ్ధిదారులకు రూ.16,21,500 లక్షలు, జమ్మికుంటలో ఆ మండలానికి చెందిన లబ్ధిదారులకు రూ.1,24,500, జమ్మికుంట పట్టణానికి చెందిన లబ్ధిదారులకు రూ.9,64,500 విలువైన చెక్కులు అందజేశారు. వీణవంక మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 88 మంది లబ్ధిదారులకు రూ.18,95,500 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అలాగే ఇల్లందకుంటకు చెందిన లబ్ధిదారులకు రూ.77 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్, హుజూరాబాద్ పీఏసీఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, సీనియర్ నాయకుడు గందె శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు డాక్టర్ ఐలయ్య, కౌన్సిలర్లు తాళ్లపల్లి శ్రీనివాస్, ప్రతాప తిరుమల్ రెడ్డి, అపరాధ ముత్యం రాజు, ఇమ్రాన్, కొండ్ర నరేశ్, నాయకుడు పూర్ణచందర్, వీణవంకలో మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, మాజీ జడ్పీటీసీ మాడ వనమాల-సాధవరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచులు నీల కుమార స్వామి, పోతుల నర్సయ్య, బండారి ముత్తయ్య, మోరె సారయ్య, పొదిల జ్యోతి-రమేశ్, నాయకులు కామిడి శ్రీనివాస్‌రెడ్డి, మధురెడ్డి, మ్యాక సమ్మయ్య, భానుచందర్, యాసిన్, మూల పుల్లారెడ్డి, సమ్మిరెడ్డి, తిరుపతిగౌడ్, ముత్యాల శంకర్, ఊట్ల దేవయ్య, మధుసూదన్‌రెడ్డి, పర్లపెల్లి తిరుపతి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రూప్ 2 పరీక్షలు

- గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, డిసెంబర్ 14 : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్ 2 పరీక్షలు నేటి నుంచి రెండు రోజుల పాటు జరుగనున్నాయి. జిల్లాలో 26,977 మంది హాజరుకానుండగా, 56 పరీక్ష కేంద్రా లు ఏర్పాటు చేశారు. అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలని, టీజీపీఎస్సీ నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందేనంటూ కలెక్టర్ పమేలా సత్పతి వెల్లడించారు. రోజు రెండు సెషన్ల చొప్పున జరిగే పరీక్షల్లో ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు, మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకు మాత్రమే లోనికి వెళ్లేందుకు అనుమతించనున్నట్లు స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ వెంట బ్లూ, బ్లాక్ పాయింట్ పెన్నులు, ఫొటోతో కూడిన హాల్‌టికెట్, ప్రభుత్వం జారీ చేసిన ఒరిజినల్ ఫొటో ఐడీ కార్డు తీసుకుని కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. హాల్‌టికెట్‌పై పాస్ పోర్టు సైజు ఫొటో ముద్రించి తీసుకెళ్లాలని, ఒకే హాల్‌టికెట్‌ను పరీక్ష మొత్తం వినియోగించాలని పేర్కొన్నారు. హాల్‌టికెట్‌లో ఫొటో సక్రమంగా లేకపోతే మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు గెజిటెడ్ అధికారి లేదా చివర చదివిన విద్యా సంస్థ ప్రిన్సిపాల్ సంతకంతో తీసుకెళ్లి, ఇన్విజిలేటర్‌కు అప్పగించాలన్నారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ డివైసెస్ సెల్ ఫోన్, కాలిక్యూలెటర్, పెన్‌డ్రైవ్, బ్లూటూత్, జువెల్లరీ ఐటమ్స్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్, ఇతర సామగ్రిని పరీక్ష కేంద్రంలోనికి తీసుకెళ్లరాదన్నారు. టీజీపీఎస్సీ నిబంధనలు పాటించకపోతే చట్టప్రకారం చర్యలు తప్పవని తేల్చిచెప్పారు. బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తయ్యేవరకు అభ్యర్థులు పరీక్ష హాల్ విడిచి వెళ్లరాదని, బయోమెట్రిక్ వేయని అభ్యర్థుల ఓఎంఆర్ షీట్ ఇన్‌వాలిడ్‌గా పరిగణించనున్నట్లు తెలిపారు. మెహిందీ, టాటూలాంటివి చేతులపై పెట్టుకోరాదని, ఇన్విజిలేటర్ సమక్షంలోనే అభ్యర్థులు హాల్‌టికెట్‌పై సంతకాలు చేయాలని సూచించారు.

ట్రినిటీ రామానుజన్ టెస్ట్ 2024 పోస్టర్ ఆవిష్కరణ

తెలంగాణచౌక్, డిసెంబర్ 14: ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస్ రామానుజన్ జయంతి పురస్కరించుకొని ఈనెల 22న నిర్వహించనున్న ట్రినిటీ రామానుజన్ టెస్ట్ 2024 పోస్టర్‌ను శనివారం ప్రెస్ భవనంలో ట్రినిటీ కళాశాల ప్రిన్సిపాల్స్ ఆవిష్కరించారు. గణిత శాస్త్రంలో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన విద్యార్థుల్లోని ప్రతిభను వెలుగులోకి తీసుకురావడం కోసం నగరంలోని ట్రినిటీ ప్రైమ్ క్యాంపస్‌లో పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తామన్నారు.

17న జిల్లాస్థాయి కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు

కొత్తపల్లి, డిసెంబర్ 14 : జిల్లాస్థాయి జూనియర్ కబడ్డీ బాలబాలికల జట్టు ఎంపిక పోటీలను ఈనెల 17న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ చైర్మన్ వెలిచాల రాజేందర్‌రావు, ప్యాట్రన్ డాక్టర్ ఇ. ప్రసాదరావు, అధ్యక్షుడు డాక్టర్ అమిత్ కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు బాలికలు 65 కిలోల లోపు, బాలురు 70 కిలోల బరువు లోపు కలిగి, 12-01- 2005 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఒరిజినల్ ఆధార్‌కార్డ్ లేదా ఎస్సెస్సీ మెమో జిరాక్స్‌ను వెంట తీసుకొని మధ్యాహ్నం మూడు గంటల్లోపు పోటీలు నిర్వహించే అంబేద్కర్ స్టేడియంలో రిపోర్ట్ చేయాలని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లేశ్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ సంపత్‌రావు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను జనగామ జిల్లాలో ఈనెల 27న జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

తెలంగాణచౌక్, డిసెంబర్ 14: విద్యాశాఖ మంత్రిని నియమించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విద్యా శాఖ మంత్రి లేకపోవడంతో విద్యార్థులు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దేశంలో విద్యా శాఖ మంత్రి లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను విస్మరించిన సీఎం రేవంత్‌రెడ్డి పాలనకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో నాయకులు శివ, విజయ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వీణవంక, డిసెంబర్ 14: రెడ్డిపల్లి గ్రామ కూడలి వద్ద రెండు ప్రమాదాలు జరుగగా ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని కోర్కల్ గ్రామానికి చెందిన పిక్కల ఐలయ్య (46) వీణవంకకు ఎక్సెల్‌పై వెళ్తుండగా, అదేసమయంలో జమ్మికుంట ప్రభుత్వ దవాఖానలో విధులు ముగించుకొని మరోవ్యక్తి బైక్‌పై కరీంనగర్‌కు బయలుదేరాడు. రెడ్డిపల్లి చౌరస్తా వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో పిక్కల ఐలయ్యకు తీవ్రగాయాలు కాగా, ఎదురుగా వస్తున్న వ్యక్తికి చేయివిరిగింది. శుక్రవారం రాత్రి జమ్మికుంట మండలం మాచనపల్లి గ్రామానికి చెందిన మహిళ మండలంలోని శ్రీరాములపేట గ్రామంలో జరిగిన శుభకార్యానికి హాజరై తిరిగి మాచనపెల్లికి బైక్‌పై భర్తతో కలిసి వెళ్తుండగా, రెడ్డిపల్లి కూడలి వద్ద ఉన్న గుంతలో పడగా తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం వీరిని 108 వాహనంలో జమ్మికుంట దవాఖానలకు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రమాదాలకు అడ్డాగా మారిన రెడ్డిపల్లి కూడలి వద్ద ఉన్న గుంతను వెంటనే పూడ్చి వేయించాలని మండల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

ప్రతి కార్మికుడికీ అండగా బీఎంఎస్

- భారత్ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్

విద్యానగర్, డిసెంబర్ 14: ప్రతి కార్మికుడికీ బీఎంఎస్ నాయకులు అండగా ఉండి, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని భారత్ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం బీఎంఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పసుల శ్రవణ్, ఉపాధ్యక్షులుగా నోముల ప్రసాద్, గోవిందుల సతీశ్, నక్క అరుణ్ కుమార్, ఎం రమణయ్య, జిల్లా కార్యదర్శిగా తొర్తి శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా రామాంజనేయులు, దేవరనేని మహేందర్ రావు, తాటికొండ తిరుపతి, కర్ణకంటి సత్యం, కోశాధికారిగా పోతరవేణ కుమార్ యాదవ్, కార్యాలయ కార్యదర్శిగా మాడిశెట్టి సునీల్, కార్యవర్గసభ్యులుగా టి. శివ రామ కృష్ణ, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్‌తో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఎంఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడు సుధీర్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పప్పుల సురేశ్, బీడీ మజ్దూర్ మహా సంఘ్ రాష్ట్ర కార్యదర్శి సిపివేరు కిష్టయ్య, జిల్లా కార్యదర్శి రేణికుంట శంకర్, కంది కొండల్ రెడ్డి, సాగర్ పాల్గొన్నారు.

పత్తి, కంది పంట దగ్ధం

శంకరపట్నం, డిసెంబర్ 14: కేశవపట్నం గ్రామ శివారులో శనివారం ఓ రైతుకు చెందిన పత్తి, కంది పంట అగ్నికి ఆహుతైంది. గ్రామానికి చెందిన ఐలయ్య అనే రైతు ఎకరా 10 గుంటల భూమిలో పత్తి, కంది పంటను సాగు చేశాడు. అయితే ఈ భూమికి పక్కనే గల మరో రైతు వానకాలం వరి కోసి వరి కొయ్యలకు నిప్పు పెట్టాడు. మంటలు తన పత్తి, కంది పంటకు వ్యాపించి 20 గుంటల విస్తీర్ణం భూమిలో పంట దగ్ధం అయినట్లు ఐలయ్య వాపోయాడు. ఈ మేరకు కేశవపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

పేద మహిళకు చేయూత

సరితకు కుట్టు మిషన్ అందజేస్తున్న సప్తగిరి లయన్స్ క్లబ్ సభ్యులు

విద్యానగర్, డిసెంబర్ 14: పేద కుటుంబానికి చెందిన మహిళకు సప్తగిరి లయన్స్ క్లబ్ సభ్యులు ఉచితంగా కుట్టు మిషన్‌ను పంపిణీ చేసి చేయూతనందించారు. శనివారం జరిగిన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ సమావేశం అనంతరం, జనగామ సరితకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గునుకుల సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి కొండం అంజిరెడ్డి, కోశాధికారి అనవేన శ్రీనివాస్, జోన్ చైర్ పర్సన్ గడప కోటేశ్‌కుమార్ తదితరులు కుట్టు మిషన్‌ను అందజేశారు. సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ ఎంపీటీసీ మృతి

నందయ్య(ఫైల్)

గంగాధర, డిసెంబర్ 14: రోడ్డు ప్రమాదంలో మాజీ ఎంపీటీసీ మృతి చెందిన ఘటన మండలంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కురిక్యాల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ అలువోజు నందయ్య(50) తన ద్విచక్ర వాహనంపై మరో యువకుడితో కలిసి మధురానగర్ చౌరస్తాకు బయలుదేరారు. అదే సమయంలో కొడిమ్యాల మండలం నమిలికొండ గ్రామానికి చెందిన రాజు అనే యువకుడు చౌరస్తాకు వెళ్తుండగా, రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నందయ్య, రాజును స్థానికులు 108 వాహనంలో కరీంనగర్ దవాఖానకు తరలిస్తుండగా, మార్గమధ్యంలో నందయ్య మృతి చెందాడు. నందయ్య మృతితో కురిక్యాల గ్రామంలో విషాదం అలుముకున్నది. కాగా, నందయ్య మృతిపై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

పద్మనాయక వెలమ సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

కార్పొరేషన్, డిసెంబర్ 14: ముకరంపురలోని పద్మనాయక కల్యాణ మండపంలో శనివారం పద్మనాయక వెలమ సంఘం ఆధ్వర్యంలో వెలమ సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. 65 మందికి సుమారు రూ.3.18లక్షల విలువ గల చెక్కులను అందించారు. కార్యక్రమంలో పద్మనాయక వెలమ సంఘం కరీంనగర్ అధ్యక్షుడు జువ్వాడి వేణుగోపాలరావు, ప్రధాన కార్యదర్శి చీటీ ప్రకాశరావు, ఉపాధ్యక్షుడు గండ్ర సంపత్ రావు, సంయుక్త కార్యదర్శి భూపతి రావు, కోశాధికారి భీమ్ రావు, కార్యవర్గ సభ్యులు అనిల్ కుమార్, శంకర్ రావు, మోహన్ రావు, సంపత్ రావు, మాధవరావు, రాజగోపాల్ రావు, వేణుగోపాల రావు, సుధాకర్ రావు, అశోక్ రావు, గీత మంజుల, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సదస్సు విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, డిసెంబర్ 14: నగరంలో ఈనెల 17న నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగా పిలుపునిచ్చారు. నగరంలోని ప్రెస్ భవనంలో రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులతో కలిసి శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీ సాక్షిగా ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి, దానిని విస్మరించి మాదిగ జాతికి ద్రోహం చేస్తున్నాడని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయక పోవడంతో మాదిగ యువత ఉద్యోగాల్లో నష్ట పోతున్నదని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి మాదిగల విశ్వాసం కోల్పోయారని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం జనవరి 17న హైదరాబాద్‌లో తల పెట్టిన వెయ్యి గొంతుకలు, లక్ష డప్పుల దండోరా సభను విజయవంతం చేయడం కోసం ఈనెల 17 నిర్వహించే సన్నాహక సమావేశానికి అధిక సంఖ్యలో మాదిగా పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు వెంకట స్వామి, కార్తిక్, రుద్రరాపు రామచందర్, శంకర్,